క్లుప్తంగా

పొగాకుతో క్యాన్సర్



పొగాకుపై అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం అరుణ

తాడిమర్రి: పొగాకు వాడకంతో ప్రాణాంతకమైన కార్యన్సర్ వస్తుందని స్థానిక జెడ్పీ ఉన్నత ప్రధానోపాధ్యాయురాలు అరుణ హెచ్చరించారు. పొగాకు నిర్మూలనపై శుక్రవారం ఆమె విద్యార్థులు, ఉపాధ్యాయుతో కలసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె కిరాణా దుకాణాల వద్ద విద్యార్థులతో కలసి పొగాకుతో జరిగే నష్టాన్ని దుకాణదారులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు ఆరోగ్యాన్నే మాత్రమే కాకుండా జీవితాన్నే కాల్చేస్తుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి అంత్యక్రియలు

పుట్టపర్తి: మండల కేంద్రం బుక్కపట్నం బ్రాహ్మణ వీధిలో నివాసముంటున్న వృద్ధ మహిళ రామచంద్రమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమెకు ఎవరూ లేకపోవడంతో ఖిద్మత్ ఎ ఖల్క్ చారిటబుల్ ట్రస్టు వారు శుక్రవారం నాగేపల్లి వద్ద ఉన్న విద్యుత్ దహన వాటికకు తీసుకెళ్లి దహన సంస్కారాలు చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు షామీర్, గోపి, అలీ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి జేఏసీ నూతన కార్యవర్గం ఎంపిక





ఇల్లూరి సుదర్శన్‌రెడ్డి, గుమ్మన వెంకటకృష్ణారెడ్డి

ధర్మవరం: ఆంధ్రప్రదేశ్ రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు విప్పల శివకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ధర్మవరం నియోజకవర్గ రెడ్డి జేఏసీ అధ్యక్షుడిగా ఇల్లూరి సుదర్శన్‌రెడ్డి, ధర్మవరం పట్టణాధ్యక్షుడిగా గుమ్మన ఎల్‌ఐసీ వెంకటకృష్ణారెడ్డిని నియమించారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామాటం శేషాద్రిరెడ్డి తెలిపారు. నూతనంగా ఎంపికైన నియోజకవర్గ రెడ్డి జేఏసీ అధ్యక్షుడు ఇల్లూరి సుదర్శన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గుమ్మన వెంకటకృష్ణారెడ్డిని రెడ్డి జేఏసీ నాయకులు అభినందించారు.

బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు

ప్రశాంతి నిలయం: కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సంకారపు జయశ్రీ డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు నామాల శంకర్ ఆధ్వర్యంలో నాయకులు పుట్టపర్తి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లాడుతూ బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు మాట్లాడుతూ బీసీల కులగణన చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, జిల్లా సహాయ కార్యదర్శి కుమ్మరి వెంకటరమణ, ధర్మవరం నియోజకవర్గ అధ్యక్షుడు గిర్రాజు రవి,పట్టణ అధ్యక్షులు బండి వెంకటేష్,ఉపాధ్యక్షులు గోగుల రవి,బీసీ నాయకులు శంకర్,చంద్రశేఖర్,పల్లా నవీన్ కుమార్ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ క్రాంతికుమార్, ఎంపీపీ రమణారెడ్డి

పుట్టపర్తి టౌన్: సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని చెన్నైకు చెందిన శంకర్ నేత్రాలయం ఆధ్వర్యంలో శుక్రవారం పుట్టపర్తిలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్, పుట్టపర్తి ఎంపీపీ ఏ.వి రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ గంగాద్రి, నిర్వాహకులతో కలసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురష్కరించుకుని ఆరు రోజుల పాటు శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతోపాటు అవసరమైనవారికి ఆపరేషన్లు నిర్వహిస్తామన్నారు.

వణికిస్తున్న విషజ్వరాలు

- పెరుగుతున్న రోగుల సంఖ్య
- పలు గ్రామాల్లో డెంగీ పాజిటివ్ కేసులు
- పట్టించుకోని ప్రభుత్వం



పీహెచ్‌సీలో పరీక్షలు చేయిచుకుంటున్న రోగులు

నల్లచెరువు: కూటమి ప్రభుత్వంలో ప్రజారోగ్యం దైవాధీనంగా మారింది. సీజనల్ వాధ్యులు విజృంభిస్తున్నా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో రోగాలబారిన పడిన ప్రజలు ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారు. మండలవ్యాప్తంగా ఇటీవల విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఏ గ్రామంలో చూసినా దగ్గు, జలుబు, జ్వరం, కీళ్ల నొప్పులు వంటి లక్షణాలతో పదుల సంఖ్యలో బాధపడుతున్నారు. ఉప్పార్లపల్లి, రాగన్నగారిపల్లి గ్రామాల్లో ఇద్దరు పిల్లలకు జ్వరం రావడంతో తల్లి దండ్రులు వారిని కదిరిలోని ఓ ప్రైవేట్ ఆసుత్రికి తీసుకెళ్లారు పరీక్షించిన వైద్యులు వారికి డెంగీ పాజిటివ్ ఉందని తేల్చారు. ఇంత జరుగుతున్నా వైద్యాధికారులు గ్రామాల్లో ఎలాంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు.

పడకేసిన పారిశుధ్యం

గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. వర్షాకాలం కావడంతో మురుగునీటికి వర్షపునీరు తోడు కావడంతో ఎటు చూసినా అపరిశుభ్రత తాండవిస్తోంది. దీంతో దోమలు బెడద ఎక్కువై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. రోజూ గ్రామాల్లో పర్యటించాల్సిన మండల అధికారులు ప్రజల ఆరోగ్యాన్ని గాలికొదిలేశారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పెరుగుతున్న ఓపీల సంఖ్య

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గతంతో పోలిస్తే రోజురోజుకూ రోగుల సంఖ్య పెరుగుతోంది. నెల ముందు వరకూ రోజూ 70 నుంచి 90 వరకూ ఔట్ పేషెంట్లు నమోదయ్యేవారు. ఇప్పుడు రోజుకు 120 నుంచి 150 వరకూ చికిత్స పొందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఇంటింటా సర్వే చేస్తున్నాం



గ్రామాల్లో వైద్యారోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు ఇంటింటా ఫీవర్ సర్వే చేసి జ్వర బాధితులను గుర్తిస్తున్నాం. ప్రతి గ్రామంలోనూ వైద్య విబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నాం. పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకొని గ్రామాల్లో శానిటేషన్ చర్యలు చేపడుతున్నాం.

–డాక్టర్ అలేఖ్య వైద్యాధికారి, నల్లచెరువు మండలం

సమస్యలు పరిష్కరించాలని నిరసన



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

ధర్మవరం అర్బన్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బికె ముత్యాలప్ప, జిల్లా ఉపాధ్యక్షులు సానే రవీంద్ర రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ఏపీటీఎఫ్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు పూర్తయినా ఉపాధ్యాయ, ఉద్యోగులు సమస్యలు పరిష్కరించకపోవడం సరికాదన్నారు. 12వ పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలని, ఐఆర్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు వెంటనే ప్రకటించాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని, అన్ని రకాల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసులు, పట్టణాధ్యక్షుడు గోపి, ప్రధాన కార్యదర్శి అంజి నాయక్, మండలాధ్యక్షుడు శివానంద, కార్యదర్శి ఈశ్వరయ్య, నాయకులు జెన్నే నాగప్ప, ఉమాపతి, పెద్దారెడ్డి, శ్రీనివాసులు, వాసు, శంకర్‌నారాయణ, కృష్ణవేణి, కళావతి, బషీర్ అహమ్మద్, హేమంత్, అమానుల్లా, నాగరాజు, వెంకటేష్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ: పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని శుక్రవారం తహసీల్దార్ కార్యాలయ అధికారికి అందజేశారు. ఏపీటీఎఫ్ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి త్రిమూర్తి, జిల్లా కార్యదర్శి కమతం ఆది బయన్న, జిల్లా ఉపాధ్యక్షులు దార్ల రాజశేఖర్, జిల్లా సీనియర్ నాయకులు డి. నారాయణ, జోనల్ సీనియర్ బాధ్యులు వెంకట్రామిరెడ్డి, నల్లమాడ మండల అధ్యక్షులు నరసింహులు, మండల ప్రధాన కార్యదర్శి జెఎస్ మహబూబ్ బాషా, జోనల్ నాయకులు నాగభూషణం, స్థానిక హైస్కూల్ ఉపాధ్యయులు శ్రీనివాసరెడ్డి, సురేష్‌బాబు పాల్గొన్నారు. అంతకుమునుపు నాయకులు స్థానిక హైస్కూల్‌లో సభ్యత్వ నమోదు చేపట్టారు.

చెన్నేకొత్తపల్లి: ఉద్యోగ,ఉపాధ్యాయ సమస్యలు, పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్ నాయకులు తహసీల్దార్ సురేష్‌కుమార్‌ను కలసి శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ మారెప్ప, మండల అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, గౌరవాధ్యక్షుడు వెంకట్రాముడు, శ్రీనివాసులు, చంద్ర,గోపాల్, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది, విద్యార్థులు

తనకల్లు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి లోకేశ్వర్‌రెడ్డి అన్నారు. నల్లగుట్లపల్లి జెడ్పీహైస్కూల్‌లో శుక్రవారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని పేర్కొన్నారు. పాఠశాలలో ఉన్న 152 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. వారిలో 11 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. కంటి చూపు బాగుండాలంటే మంచి పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆప్తాలిమ్‌క్ ఆఫీసర్ గణేష్‌రెడ్డి, హెచ్‌ఎం శ్రీధర్‌రెడ్డి, హెల్త్ అసిస్టెంట్ ముసల్‌రెడ్డి, సీహెచ్‌ఓ మంజుల, ఏఎన్ఎం రెడ్డెమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్: సీజనల్ వ్యాధులపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎనుములపల్లి వైద్యాధికారి డాక్టర్ మునిచంద్రిక పేర్కొన్నారు. శుక్రవారం మార్లపల్లి, రాచువారిపల్లి, బుగ్గపల్లి గ్రామాల్లో వైద్య సిబ్బందితో కలిసి డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో ప్లాస్టిక్ గ్లాసులు, వాడేసిన కొబ్బరి బోండాలు, టైర్లు, ఎయిర్ కూలర్లు తదితరాల్లో నీటి నిలువ ఉన్నట్లయితే దోమలు ప్రబలి జ్వరాలు వ్యాపింపజేస్తాయన్నారు. లార్వాలపై అబేట్ మందును పిచికారీ చేయించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివరాం, సూపర్‌వైజర్ వెంకటరమణ, ఏఎన్‌ఎం సుగుణ తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి



పుట్టపర్తిలో ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ధర్మవరం: సీతారాం ఏచూరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు ఎస్‌హెచ్ బాషా, సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో–కన్వీనర్ ఆయుబ్‌ఖాన్ ,నాయకులు ఎల్.ఆదినారాయణ, హైదర్‌వలి, వెంకటస్వామి, ఎస్ఎఫ్ఐ నాయకులు అమర్, శ్రీనాథ్, అనిల్ పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: సీతారాం ఏచూరి ఆశయ సాధనకు కృషి చేద్దామని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళర్పించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి బ్యాళ్ల అంజి, నాయకులు సాకే వెంకటేష్, పెదపల్లి బాబా, ముత్యాలు, శ్రావణి, బువ్వమ్మ, తిరుపాలు, రామన్న తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్: పేదల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప వ్యక్తి సీతారాం ఏచూరి అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని న్యూ అమీన్‌నగర్‌లో పేదలు ఏర్పాటు చేసుకున్న గుడిసెల వద్ద శుక్రవారం జిల్లా కమిటీ సభ్యుడు హరి అధ్యక్షతన సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ ఏర్పాటు చేశారు. సీపీఎం జిల్లా కమిటి సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, సాంబశివ, రామ్మోహన్,నారాయణ, శాంతిబాయి, మారుతి,శివన్న, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఓడీచెరువు: మండల కేంద్రంలో శుక్రవారం సీపీఎం నేతలు సీతారాం ఏచూరి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం సీనియర్ నేత రమణ ఏచూరి సేవలను కొనియాడారు. సీపీఎం మండల కన్వీనర్ కుళ్లాయప్ప, నేతలు రామకృష్ణ, సురేష్, తిరుపాల్, అంజి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మున్సిపల్ క్లస్టర్ కమిటీ నియామకం

ధర్మవరం రూరల్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ధర్మవరం మున్సిపల్ క్లస్టర్–1 కమిటీని నియమించారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. క్లస్టర్ కమిటీ వైస్ ప్రెసిడెంట్లుగా గుద్దిటి నారాయణస్వామి, టి. సహదేవరెడ్డి, జనరల్ సెక్రటరీలుగా డి.ఖాదర్‌వలి, జెన్నే సురేష్, బుగ్గా నాగభూషణ, ఎ.నారాయణస్వామి, సెక్రటరీలుగా గుండా ఈశ్వరయ్య, తలారి యుగంధర్, అంబటి హరిప్రసాద్, కనేకంటి భాస్కర్‌రెడ్డి నియమితులయ్యారు. అలాగే ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కె. శ్రీనివాసులు, పి. పవన్‌రెడ్డి, పామాల నారాయణ స్వామి, వి. దివాకర్‌నాయక్, సి. నరసింహులు, జంపన్న నారాయణస్వామి, రవీంద్రారెడ్డి, ఎం. ఓంప్రకాష్, బిస్త రమణ, పి.కృష్ణారెడ్డి, గజ్జెల మురళీ, పోలా శ్రీనివాసులు, యంబా తిరుపాల్, టీఎస్ మూర్తి, హెచ్. జగదీష్, సి. గంగాధర్, పాళ్ల రామాంజనేయులు, దాసరి రామాంజనేయులు, ఎంసీ మురళీ, ఎ.నరేష్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం



రామగిరిలో జరుగుతున్న మండల సర్వసభ్య సమావేశం

రామగిరి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం తూతూమంత్రంగా నిర్వహించారు. మండలంలో పదిమంది ఎంపీటీసీలు ఉండగా, గతేడాది డిసెంబర్‌లో అప్పటి ఎంపీపీ మీనుగ నాగమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి నాలుమార్లు ఎంపీపీ ఉప ఎన్నిక వాయిదా పడుతూ వస్తోంది. వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు పదిమందిలో తొమ్మిది మంది గెలవగా, టీడీపీ మద్దతుదారులు ఒక్కరు గెలిచారు. అనంతరం జరిగిన పరిణామాల్లో ఇద్దరు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను టీడీపీలోకి చేర్చుకోగా, ఆరుగురు వైఎస్సార్‌సీపీ తరఫున ఉన్నారు. గతవారంలో జరగాల్సిన మండల సమావేశానికి ఒక్కరు మాత్ర మే హాజరుకాగా, శుక్రవారం జరిగిన సమావేశానికి ముగ్గురు సభ్యులు మాత్రమే హాజరయ్యారు. మండల సర్వసభ్య సమావేశానికి సభ్యులందరూ హాజరుకావాల్సి ఉంది. అధికారులు ముగ్గురితోనే సమావేశం ముగించారు.

నంది విగ్రహాన్ని అపహరించిన వారిని అరెస్ట్ చేయాలి

- పోలీస్ స్టేషన్ ఎదుట గ్రామస్తుల ధర్నా



పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ముష్టికోవెల గ్రామ సమీపంలో ఉన్న పురాతన శివాలయంలో ఈ నెల 4న నంది విగ్రహాన్ని అపహరించుకెళ్లిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలంటూ పోలీస్ స్టేషన్ ఎదుట గ్రామస్తులు శుక్రవారం ధర్నా చేపట్టారు. ముష్టికోవెల పంచాయతీ పరిధిలోని సుబ్బరాయనిపల్లి, గువ్వలగొందిపల్లి, ముష్టికోవెల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామస్తులకు వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు సంఘీభావం తెలిపారు.

ఈ -క్రాప్ తప్పనిసరి

పుట్టపర్తి: పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఈ–క్రాప్ బుకింగ్ తప్పనిసరిగా చేయించుకోవాలని బుక్కపట్నం ఏఓ నటరాజ్ సూచించారు. ఆయన శుక్రవారం సిబ్బందితో కలిసి క్షేత్ర స్థాయిలో ఈ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యం



నూతన అధ్యక్షులను సన్మానిస్తున్న దృశ్యం

నల్లచెరువు: వైఎస్సార్‌సీపీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి అన్నారు. మండలానికి చెందిన ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు రమణ నాయక్, పంచాయితీ రాజ్ వింగ్ అక్బర్, వైఎస్సార్ టీయూసీ అధ్యక్షుడు పి. ఖాదర్‌వలి శుక్రవారం మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులను మండల కన్వీనర్ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ కన్వీనర్ రఫి, టెంపుల్ మాజీ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, మాజీ సర్పంచులు నరసింహారెడ్డి, రమణారెడ్డి, సీనియర్ నాయకులు పోరెడ్డి వెంకటరెడ్డి నాయకులు రాజు నాయక్,రమేష్ నాయక్, రామాంజులు నాయక్, హరీష్ నాయక్, ఆంజనేయులు నాయక్, సూర్యనారాయణ, కుమార్ నాయక్, మురళి నాయక్, వస్పత్ నాయక్, మహేంద్ర, క్రిష్టా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ఎన్‌పీకుంట: స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో ఆర్థిక అక్షరాస్యతపై కదిరి ఏడీసీసీ బ్యాంక్ మేనేజర్ మహాలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబ ఆర్థిక పరిస్థితులను చక్కదిద్దడంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో వారికి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరమని తెలిపారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద ఏడాదికి రూ.20 ప్రీమియం చెల్లిస్తే రూ.రెండు లక్షల ప్రమాదబీమా వర్తిస్తుందన్నారు. అలాగే ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన కింద ఏడాదికి రూ.436 చెల్లిస్తే రూ.రెండు లక్షలు పరిహారం వస్తుందన్నారు. అనంతరం సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సొసైటీ సిబ్బంది సుమశ్రీ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల అందజేత



క్రీడా దుస్తులు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

తాడిమర్రి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాలలో 1991–1992లో పదో తరగతి చదవిన నాగరాజు, కాటమయ్య, రామ్మోహన్, భగవంత్‌రెడ్డి తదితర పూర్వ విద్యార్థులు దుస్తులు వితరణ చేశారు. హెచ్‌ఎం అరుణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు రూ.15 వేలు విలువ చేసే 35 జతలను అందించారు. కార్యక్రమంలో ఆదినారాయణ, శివారెడ్డి, కుళ్లాయరెడ్డి, పీడీ అమరాంజినేయులు, పీఈటీ ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

పుట్టపర్తి అర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పుట్టపర్తిలో పలువురు న్యాయవాదులు నిరసన తెలిపారు. శుక్రవారం ఇండియన్ లాయర్స్ అసోషియేషన్, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పుట్టపర్తి బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం న్యాయవాదులకు ఉచిత ఆరోగ్య బీమా కార్డులు అందించాలని, అడ్వొకేట్ వెల్ఫేర్ డెత్ బెనిఫిట్‌ను రూ.10 లక్షలకు పెంచాలని, మరణించిన న్యాయవాదులకు మాచింగ్ గ్రాంట్ రూ.4 లక్షలు వెంటనే చెల్లించాలని, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ అధ్యక్షులు కత్తి గంగిరెడ్డి, న్యాయవాదులు యదుభూషణ, కృష్ణప్రసాద్, నాగేంద్ర, రాజగోపాల్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్

చెన్నేకొత్తపల్లి: చెన్నేకొత్తపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లోని మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు అంగన్‌వాడీ యూనియన్ నాయకులు రమణమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో మొత్తం 28 మినీ అంగన్‌వాడీ సెంటర్లలో 27 సెంటర్లను మెయిన్ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేశారన్నారు. దీంతో మినీసెంటర్లలో పని చేస్తున్న సిబ్బంది స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

ఇసుక వాహనాల సీజ్

బత్తలపల్లి: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు టిప్పర్లు, ఓ ట్రాక్టర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించినట్లు బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం బత్తలపల్లి మండలం జ్వాలాపురం క్రాస్ వద్ద రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇసుక చెక్‌పోస్ట్ వద్ద వాహనాలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

గొడవలకు దూరంగా ఉండండి

ధర్మవరం రూరల్: ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం సుబ్బరావుపేట గ్రామంలో ఎస్ఐ గ్రామసభ నిర్వహించారు.

22 నుంచి దసరా సెలవులు ప్రకటించాలి

ఓడీచెరువు: ఈనెల 22 నుంచి దసరా సెలవులు ప్రకటించాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి షర్ఫోద్దీన్, జిల్లా అధ్యక్షుడు కట్టుబడి గౌస్ లాజమ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

చౌడేశ్వరి అతిథిగృహాల నిర్మాణానికి విరాళం

ఓడీచెరువు(అమడగూరు): అమడగూరులోని చౌడేశ్వరి ఆలయానికి సంబంధించి అతిథిగృహాల నిర్మాణానికి అమడగూరు మండలం గంగిరెడ్డిపల్లికి చెందిన వీఆర్ మార్ట్ అధినేత మద్దిమడుగు భాస్కర్ రెడ్డి రూ.7.5 లక్షలు విరాళం ప్రకటించారు. ఇందులో భాగంగా శుక్రవారం రూ.2.5 లక్షలను ఆలయ ధర్మకర్త పొట్ట పురుషోత్తంరెడ్డికి అందజేశారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం

చెన్నేకొత్తపల్లి: మండలంలోని ప్యాదిండిలోని మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న చంద్రశేఖర్ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నాడు. శుక్రవారం పాఠశాలలో ఎంఈఓ–1 మున్వర్‌బాషా, ఎంఈఓ–2 ప్రసూన్ కుమార్‌నాయుడు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

'రణభేరి'ని జయప్రదం చేయండి

గాండ్లపెంట: యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల15 నుంచి 19 వరకు జరిగే రణభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి సి.తాహిర్‌వలీ కోరారు. ఈమేరకు ఆయన ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా నాయకులు మల్లికార్జున, రమణానాయక్, ఖాదర్‌బాషా సమక్షంలో శుక్రవారం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు 12వ వేతన సంఘం నియమించాలని, 29 శాతం మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని డిమాండు చేశారు. నాయకులు నారాయణ, పామిడి ముంతాజ్‌అలీ, రామసుబ్బయ్య, సాయిరాం, రమేష్, రమణారెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో భవిష్యత్ అంధకారం



మాట్లాడుతున్న పీఓ నాగలక్ష్మి

కనగానపల్లి: బాల్య వివాహాలతో భవిష్యత్ అంధకారమవుతుందని జిల్లా బాలల సంరక్షణ విభాగం పీఓలు నాగలక్ష్మి, లక్ష్మీప్రసన్న తెలిపారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన – బాలల రక్షణ చట్టాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. స్థానిక మహిళా పోలీస్ వరలక్ష్మి,పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి పాల్గొన్నారు.

చెత్త ఊడ్చడంలో గొడవ: ముగ్గురిపై కేసు

ధర్మవరం అర్బన్: ఇంటి ముందు చెత్త ఊడ్చడంలో ఇద్దరు మహిళల మధ్య జరిగిన గొడవలో పోలీసులు ముగ్గురు మహిళలపై కేసు నమోదు చేశారు. టూ టౌన్ సీఐ రెడ్డెప్ప తెలిపిన వివరాలు.. పట్టణంలోని కేతిరెడ్డికాలనీకి చెందిన పూజారి జయలక్ష్మి మగ్గం నేస్తూ జీవిస్తున్నారు. జయలక్ష్మి ఇంటి వెనుక లక్ష్మీదేవి అనే మహిళ చెత్తను ఊడ్చే సమయంలో తరచూ గొడవ పడేది. జయలక్ష్మి ఈనెల 8న ఇంటిలో ఉండగా లక్ష్మీదేవి మరోసారి చెత్త విషయంలో గొడవపడి దుర్భాషలాడింది. అదేరోజు మధ్యాహ్నం 1గంట సమయంలో జయలక్ష్మి ఇంటిలోకి లక్ష్మీదేవి, ఆమె కూతురు రాధ, కోడలు వెళ్లి జయలక్ష్మిని దుర్భాషలాడుతూ ఆమెపై దాడిచేసి గాయపరిచారు. గమనించిన చుట్టుపక్కలవారు విడిపించి గాయపడిన జయలక్ష్మిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోలుకున్న జయలక్ష్మి శుక్రవారం సాయంత్రం టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు లక్ష్మీదేవి, ఆమె కుమార్తె రాధ, కోడలిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

నల్లచెరువు: మద్దిమడుగు పంచాయితీకి చెందిన వైఎస్సార్‌సీపీ నేత రమేష్‌రెడ్డి తండ్రి, సీనియర్ నాయకుడు పుల్లా శివారెడ్డి(75) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. శుక్రవారం స్వగ్రామంలో కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి, మాజీ సర్పంచులు నరసింహారెడ్డి, రమణారెడ్డి, పుల్లా జయచంద్రారెడ్డి, మల్లి కార్జున రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, గోపాల్‌రెడ్డి, సహదేవరెడ్డి, నల్లచెరువు గ్రామ కన్వీనర్ సూర్యశేఖర్‌రెడ్డి(జేసీబీ) పోరెడ్డి చెన్న కేశవరెడ్డి తదితరులు శివారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

హెచ్‌ఐవీపై అప్రమత్తంగా ఉండాలి

తాడిమర్రి: ప్రాణాంతకమైన హెచ్‌ఐవీ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ డీఆర్‌పీ రమేష్ యాదవ్ హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన ఆయన ఎయిడ్స్, హెచ్‌ఐవీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన విద్యార్థులతో కలసి హెచ్‌ఐవీ సోకుండా జాగ్రత్తలు తెలిపే కరపత్రాలను విడుదల చేశారు. వైస్ ప్రిన్సిపాల్ పోతులయ్య, జోనల్ సూపర్‌వైజర్ శ్రీరాములు, లింక్ వర్కర్ ఆనంద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

పుట్టపర్తి అర్బన్: పౌష్టికాహారంతో ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ జయంతి, సూపర్‌వైజర్ సుజాత పేర్కొన్నారు. శుక్రవారం నిడిమామిడి, కొత్తూరు గ్రామాల్లో పౌష్టికాహార మాసోత్సవం, బేటీ బచావో–బేటీ పడావో కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మాధవీలత, మిషన్ వాత్సల్య సిబ్బంది వనజాక్షి, కార్యదర్శి బేబీరాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, శంకరావతి, వేదవతి, శ్రావణి, యశోద, అనంతమ్మ, సౌభాగ్య, కుర్షిదాబేగం తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

ధర్మవరం అర్బన్: అత్తింటివారు వేధిస్తున్నారంటూ వివాహిత చేసిన ఫిర్యాదు మేరకు భర్త, అత్తపై కేసు నమోదు చేసినట్లు ధర్మవరం రెండో పట్టణ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఈ మేరకు వివరాలను శుక్రవారం వెల్లడించారు. ధర్మవరంలోని రాజేంద్రనగర్‌కు చెందిన సాయికీర్తన, నరేష్‌కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి 14 నెలల వయసున్న కుమార్తె ఉంది. వివాహమైనప్పటి నుంచి అత్త వెంకటలక్ష్మి చెప్పుడు మాటలతో భార్యను భర్త శారీరకంగా, మానసికంగా హింసిస్తూ వచ్చేవాడు. ఈ విషయంగా పెద్ద మనుషుల సమక్షంలో పలుమార్లు పంచాయితీలు జరిగినా నరేష్‌లో మార్పు రాలేదు. వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో అనంతపురంలోని పుట్టింటికి సాయికీర్తన చేసుకుంది. ఘటనపై శుక్రవారం సాయంత్రం బాధితురాలు చేసిన ఫిర్యాదు మేరకు నరేష్, అతని తల్లి వెంకటలక్ష్మిపై వేధింపులు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శివారు కాలనీల్లో కార్డెన్ సెర్చ్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శివారు కాలనీల్లో శుక్రవారం ఉదయం టూటౌన్ పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. టూ టౌన్ సీఐ రెడ్డెప్ప తన సిబ్బందితో పట్టణంలోని కేతిరెడ్డి కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో అనుమానితులు, రౌడీషీటర్లు ఇళ్లను తనిఖీలు చేశారు. ఎవరైనా కొత్త వ్యక్తుకు ఇల్లు అద్దెకు ఇచ్చే సమయంలో వారి వివరాలు తనిఖీ చేసుకోవాలని సీఐ కాలనీవాసులకు సూచించారు.